


# ఉద్యోగం మానవ లక్షణం

## అన్నమయ్య పదాలు సామాజిక దృక్పథాలు

ఈ సృష్టిలో అన్ని జన్మల కన్నా మానవ జన్మ ప్రశస్తమైనది. ఒక రకంగా మనిషి జన్మ చూసి మిగత జంతుజాలం ఈర్ష్య చెందేలా ఉంటుంది. పుట్టిన ప్రతీ ప్రాణీ గిట్టక తప్పదు. కానీ బ్రతికినన్నాళ్ళు మంచిగా జీవించడం, కష్టపడడం ఇవన్నీ మనిషి జీవితానికి సార్థకత కలగ జేస్తాయి. ఇదే గీతాసార పరమార్థం. పుట్టిన ప్రతీ మనిషీ బ్రతకాలి. బ్రతకాలంటే తినాలి. తినాలంటే ఆహారం పండించాలి. పండించాలంటే కష్టపడాలి. ఈ కష్టపడడం యుగ ధర్మాన్ని బట్టి, కాలాన్ని బట్టి రూపాంతరం చెందుతూ వస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే కష్టపడడం అంటే పని చేయడమే! కానీ ఈ భూమ్మీద పడ్డ ప్రతి జీవి పని చేయాలన్న సూత్రం ఏమీ లేదు. కొంత మంది పనిజేస్తారు. కొంత మంది ఇంకోళ్ళు పనిజేస్తే వారి మీద బ్రతికేస్తారు. కాలం మారింది. మనిషి అవసరాలూ మారాయి. ఆలోచనలూ మారాయి. పూర్వం మగవాళ్ళు సంపాదిస్తే ఆడవాళ్ళు ఇంటి పట్టునుండి సంసారం నడిపేవారు. అందులోంచి పుట్టిందే "ఉద్యోగం పురుష లక్షణం" అన్న సామెత. ఇప్పుడు వనితలూ ఉద్యోగాలు చేస్తున్నారు. అది వేరే విషయం. ఈ ఉద్యోగం పురుష లక్షణం అన్న సామెత ఎలాపుట్టిందో తెలియదు కానీ, ఈ సామెతకి ముందే అన్నమయ్య "ఉద్యోగం మానవ లక్షణం" అని ఎలుగెత్తి చెప్పాడు. మనిషి అన్నాక కష్టపడాలి సోమరి తనానికి దూరంగా బ్రతకాలి అని ఓ కీర్తనలో చెప్పాడు.

మహినుద్యోగి గావలె మనుజుడైనవాడు
సహజి వలె నుండేమీ సాధింప లేడు. - పల్లవి -

వెదకి తలచుకొంటే విష్ణుడు గానవచ్చు
చెదరి మరచితే సృష్టి చీకటౌ
పొదలి నడిచితేను భూమెల్లా మెట్టి రావచ్చు.
నిదిరించితే గాలము నిముషమై తోచు. - మహి -

ఈ భూమ్మీద పడిన ప్రతీ మనిషీ ఉద్యోగి కావాలట. రోజూ తినడం నిద్రించడం భోగించడం వంటివి చేస్తూ ఏమీ సాధించలేడు. నిజంగా తలుచుకుంటే దేముణ్ణి చూడవచ్చు. అలా కాకుండా సోమరిగా ఉంటే ఈ సృష్టి చీకటిగానే కనిపిస్తుంది. కాస్త ఓపిక తెచ్చుకొని పట్టుదలకి కాళ్ళు జోడిస్తే భూమంతా ప్రదక్షిణం చేసి రావడం ఎంతో సులభం. అలాకాకుండా తినడం నిద్రించడానికే జీవితాన్ని అంకితం ఇస్తే కాలం నిమిషమై పయనిస్తుంది. ఇంతకంటే విశదంగా ఏ కవి చెబుతాడు?

వేడుకతో జదివితే వేద శాస్త్ర సంపన్నుడౌ
జాడతో నూరకుండితే జడుడౌను
వోడక తపసియైతే వున్నతోన్నతుడౌ
కూడక సోమరి యైతే గుణహీనుడౌను. - మహి -

శ్రద్ధతో ఇష్టంగా చదివితే వేద శాస్త్ర సంపన్నుడవ్వవచ్చు. అలా కాదని నిమ్మకుంటే జడ్డిగా తయారవుతారు. దీక్షతో ఓడిపోకుండా తపస్సు చేస్తే ఉన్నతుడవ్వవచ్చు. ఇవేమీ కాక పోతే అటువంటి వ్యక్తి గుణాలకి సోమరి తనం రంగు అంటినట్టే అని తేట తెల్లంగా చెప్పాడు అన్నమయ్య.

మురహరు గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెరగ కుండితే వీరిడియౌను
శరణంటే శ్రీ వేంకటేశ్వరుడు రక్షించును
పరగ సంశయించితే పాషండు డౌను. - మహి -

ఈ కీర్తన చదివేక అన్నమయ్య కవితా దృక్పథం ఎంత విశాలమైనదో తెలుస్తుంది. కేవలం శృగారానికి, భక్తికే కాదు, మానవతకీ, మానవీయ విలువలకీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన అర్జవ కవి అన్నమయ్య. ఏ వ్యక్తికైనా నీతులు సూటిగా చెబితే గుచ్చుకుంటాయి. తిరస్కార నొప్పిని కలగ జేస్తాయి. కానీ అన్నమయ్య ఎవ్వరినీ నొప్పించకుండా సమాజ శ్రేయస్సు కోరుతూ నీతులకీ, సూక్తులకీ భక్తి తత్వం అనే సున్నితమైన వస్త్రం చుట్టి మనిషిగా విలువలతో జీవించడమే దైవత్వం అని చెప్పకనే చెప్పాడు. అందుకే అన్నమయ్య సాహిత్యం అజరామరం. సుమారు అయిదు శతాబ్దాలు గడిచినా అన్నమయ్య సాహిత్యంతో ప్రతీ రోజూ మానవాళిని పలకరిస్తూనే ఉంటాడు. వాటికి స్పందించడమే మన కర్తవ్యం!

ఈ నెల మే 2 వ తేదీ అన్నమయ్య జయంతి. అన్నమయ్య జీవితకాలం 95 సంవత్సరాలే అధికమాసాలతో కలుపుకుంటే శతాయుష్కుడు. కానీ అతని సాహిత్యం నిత్య పరిమళ కవితా సుగంధం. అఘ్రాణించే మనసుండాలి కానీ అది నిత్య మల్లెలా అంటుకునే ఉంటుంది.

